ఉపాధ్యాయులకు విస్తృత సేవలు : యుటిఎఫ్

ముసునూరు: ఎందరో ఉపాధ్యాయులకు ఎన్నో సేవలు అందించిన ఘనత యుటిఎఫ్‌కే దక్కుతుందని మండల అధ్యక్షులు జి.పద్మ కిషోర్, కార్యదర్శి గుడిమెళ్ల రాంబాబు పేర్కొన్నారు. యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యాన శనివారం మండలంలోని ఐదుగురు ఉపాధ్యాయులు ఎం.సునీల్ కుమార్, జి.శ్రీదేవి, డి.దుర్గా మల్లేశ్వరి, సిహెచ్.అనురాధ, సిహెచ్‌విఎన్.రుక్మిణిల సర్వీసు వివరాలను జిల్లా అధికారులకు తెలియజేసి, స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌లో వారి సర్వీస్‌ను జిల్లా విద్యాశాఖాధికారి చేత రెగ్యులజేషన్ చేయించారు. సదరు ఉపాధ్యాయులకు యుటిఎఫ్ సేవా పుస్తకం, రెగ్యులైజేషన్, ప్రొసీడింగ్స్ కాఫీలను మండల అధ్యక్షులు జి.పద్మ కిషోర్, ప్రధాన కార్యదర్శి జి. రాంబాబు ఆధ్వర్యాన అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రమణక్కపేట పాఠశాల హెచ్‌ఎం పివిఎస్.రామకృష్ణ, చెక్కపల్లి హెచ్‌ఎం షేక్ అల్లాబక్షు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముసునూరు హెచ్‌ఎం డి.శైలజ, జిల్లా కౌన్సిల్ మెంబర్ యోగితా వింధ్య, మండల కార్యదర్శి ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

తప్పు తేల్చారు.. చర్యల్లేవ్..!

మత్స్యశాఖ నిడమర్రు ఎఫ్‌డిఒకు ఆ శాఖ ఉన్నతాధికారుల వత్తాసు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లకుండా గూడుపుఠాణి?

నిబంధనల ఉల్లంఘనపై గతంలో విచారణకు ఆదేశం

క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఏడు నెలల క్రితమే విచారణ నివేదిక సమర్పణ

వివరణ పేరుతో మెమో జారీ చేసి మమ

మళ్లీ చేపల చెరువుల అనుమతుల్లో అడ్డగోలు వ్యవహారాలపై ఆరోపణలు

వివాదాస్పద భూములకు అనుమతిచ్చేందుకు తహతహ

3. Initiate disciplinary action against the Fisheries Development Officer, Nidamarru, under the Andhra Pradesh Civil Services (CCA) Rules for dereliction of legitimate duties and failure to coordinate with the Revenue Authorities, thereby causing avoidable complications and reputational embarrassment to the Department.

In this regard, it is to submit that disciplinary action against the FDO's the competent Authority only is the Commissioner of Fisheries,A.P.,Vijayawada.

Yours faithfully,

District Fisheries Officer(FAC)
Eluru District, Eluru.

క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ విచారణ అధికారి ఉన్నతాధికారులకు ఇచ్చిన నివేదిక కాపీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మత్స్యశాఖ నిడమర్రు మండల అధికారి (ఎఫ్‌డిఒ) నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు విచారణలో తేలి ఏడు నెలలు గడిచినా ఇప్పటికీ సదరు అధికారిపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం ఏమిటో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది. మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం ఆ శాఖాధికారి విచారణ చేసిన నివేదిక ఇవ్వడంతోపాటు, ఎఫ్‌డిఒ తప్పు చేశారని, క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని తేల్చినా నేటికీ ఎటువంటి చర్యలూ లేకపోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. దీంతో మత్స్య శాఖాధికారుల నిబద్ధతపై సర్వత్రా విమర్శలు వెలువెత్తున్నాయి. మత్స్యశాఖలో జరుగుతున్న పరిణామాలను చేపల చెరువుల పెంపకం జిల్లా కమిటీ ఛైర్మన్ జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి దృష్టికి తీసుకెళ్లకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. నిడమర్రు మండల మత్స్యశాఖ అధికారిగా కె.రవికుమార్ పని చేస్తున్నారు. అదే మండలంలోని అడవికొలను గ్రామం తిమ్మారావుగూడెం రెవెన్యూ పరిధిలోని 150 ఎకరాల చేపల చెరువుకు సంబంధించి వివాదం ఏర్పడింది. సంబంధిత వ్యవహారంలో బడాబాబులకు అనుకూలంగా వ్యహరిస్తూ సన్న, చిన్నకారు రైతులు సాగు చేసుకునే చేపల చెరువుకు సంబంధించి జారీ చేసిన నోటీసులతోపాటు అతని వ్యవహార శైలి వివాదాస్పదంగా మారింది. దీంతో బాధితులు మత్స్యశాఖ జిల్లా, రాష్ట్ర అధికారులకు అనేక ఫిర్యాదులు చేశారు. దీంతో ఏప్రిల్ 17న నిడమర్రు మండల ఎఫ్‌డిఒపై విచారించి నివేదిక అందించాల్సిందిగా ఆ శాఖ జిల్లా అధికారులకు మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. విచారణ అధికారిగా కైకలూరు మత్స్యశాఖ ఎడిగా పని చేస్తున్న బి.రాజ్‌కుమార్‌ను నియమించారు. ఆయన విచారణ పూర్తి చేసి 2025 మే 24న నివేదిక సమర్పించారు. ఈ నివేదికలో ఎఫ్‌డిఒ చట్టబద్ధమైన విధులను నిర్లక్ష్యం చేయడం, అధికారులతో సమన్వయం చేసుకోకపోవడం, నివారించదగిన సమస్యలను పరిష్కరించకుండా శాఖ ప్రతిష్టకు భంగం కలిగించినందున క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇది జరిగి ఇప్పటికీ ఏడు నెలలు గడిచింది. ఆర్టికల్ ఆఫ్ చార్జ్ కింద ప్రొసీడింగ్స్ ఇచ్చినట్లు మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. దీనిపై ఎఫ్‌డిఒ వివరణ ఇవ్వాల్సి ఉంది. ఆయన ఇప్పటి వరకూ ఎటువంటి వివరణా ఇవ్వకపోయినా విధుల్లో కొనసాగిస్తూనే ఉన్నారు. దీంతో నిడమర్రు మండల ఎఫ్‌డిఒ మళ్లీ వివాదాస్పద భూముల చెరువులకు అనుమతిచ్చే పరిస్థితి నెలకొంది. విచారణ పూర్తి చేసి, తప్పు చేసినట్లు తేలిన తర్వాత ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. తప్పు చేసిన అధికారులను కొనసాగించడం కారణంగా మళ్లీమళ్లీ తప్పులు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దరఖాస్తు చేయని, వివాదాల్లో ఉన్న భూములకు అనుమతులు ఇచ్చేలా ముందుకు సాగుతున్న తీరు మరోసారి వివాదాస్పదమవుతోంది. మత్స్యశాఖలోని లొసుగులను గుర్తించి డీమ్డ్ (ఆటోమేటిక్ పర్మిషన్) వ్యవహారానికి తెరలేపి అనుమతులు ఇస్తున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీనిపై మత్స్యశాఖ ఉన్నతాధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లకుండా వ్యవహారం సాగిస్తున్నారని చర్చ

జిల్లాలో ఏ శాఖలో అధికారి తప్పు చేసినా జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్తుంది. విచారణ తర్వాత నివేదిక ఆధారంగా చర్యలనేవి ఉంటాయి. మత్స్యశాఖకు సంబంధించిన మంచినీటి చేపల పెంపకం జిల్లా కమిటీకి ఛైర్మన్‌గా కలెక్టర్ ఉన్నారు. నిడమర్రు మండలం ఎఫ్‌డిఒ విషయంలో ఇంత జరిగినా ఇప్పటి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లలేదని తెలుస్తోంది. దీనికి కారణం ఏమిటో సంబంధిత శాఖ అధికారులే చెప్పాల్సి ఉంటుంది. ఎఫ్‌డిఒను కాపాడేందుకు ఆ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారా అనే అనుమానాలు నెలకొన్నాయి. దీనిపై కలెక్టర్ వెట్రిసెల్వి వెంటనే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఎఫ్‌డిఒకు మెమో ఇచ్చారు.. వివరణివ్వలేదు

బి.రాజ్‌కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి

నిడమర్రు మండల ఎఫ్‌డిఒపై విచారణ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడం జరిగింది. ఎందుకు చర్యలు తీసుకోకూడదని వివరణ కోరుతూ మెమో జారీ అయ్యింది. దీనిపై ఇప్పటి వరకూ ఎఫ్‌డిఒ వివరణ ఇవ్వలేదు. రాష్ట్ర అధికారులే అతనిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. అప్పట్లో నేను లేను. దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారా, లేదా అనేది చూడాల్సి ఉంది. చర్యలకు సంబంధించి బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

16న నీటిపారుదల సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం ఈ నెల 16వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో నిర్వహిస్తామని ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ సిహెచ్.దేవప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గోదావరి పశ్చిమడెల్టాకు రబీ పంటకు సంబంధించి నీటి లభ్యత, ఆయకట్టు గురించి, 2025-26 రబీ అనంతరం కాల్వలు మూసివేయు తేదీ నిర్ణయం, 2026-27 ఫసలీ ఖరీఫ్ పంటకు సంబంధించి కాలువలు తెరుచు తేదీ నిర్ణయం, జిల్లాలోని మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి పంట విస్తీర్ణం, నీటి విడుదల తేదీ నిర్ణయం తదితర అంశాలపై కలెక్టర్ ఆధ్వర్యాన చర్చిస్తారని పేర్కొన్నారు.

కొనసాగిన టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్-2025) శనివారం ఏలూరులో ప్రశాంతంగా జరిగింది. వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం రెండొందల మందికి 187 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన రెండో విడత పరీక్షకు మొత్తం రెండొందల మందికి 187 మంది హాజరయ్యారు. 13 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

నీటి ఇంకుడు స్వభావ సాంద్రత పరిశీలన

పోలవరంలో కొనసాగిన శాస్త్రవేత్తల బృందం పర్యటన

నీటి ఇంకుడు స్వభావ సాంద్రత పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో మట్టి రాతి నాణ్యత నియంత్రణ పరీక్షలను సెంట్రల్ శాయిల్ మెటీరియల్ రీసెర్చి సెంటర్(సిఎస్ఎంఆర్ఎస్) కేంద్ర మట్టి పదార్థాల నాణ్యత నియంత్రణ శాస్త్రవేత్తల బృందం శనివారం రెండో రోజు నిర్వహించారు. శాస్త్రవేత్తలు హరేంద్ర ప్రకాష్, ఉదయ్ భాను చక్రబోర్తి, సిద్ధార్ధ పి.హెడవూ ప్రాజెక్టులో గ్యాప్ 1, 2 ప్రాంతాల్లో మట్టి రాతి నాణ్యతా పరిశీలనా ల్యాబులలో పర్యటించి పరీక్షలు నిర్వహించారు. ఎర్కం రాకిల్ డ్యాంలో వినియోగించే మట్టి రాతి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. నిర్మాణ ప్రాంతంలో నీటి ఇంకుడు స్వభావ సాంద్రత, మట్టి నాణ్యతా సాంద్రత పరీక్షలను నిర్వహించారు. అనంతరం కొన్ని శాంపిల్స్ సేకరించారు. ఇంజినీరింగ్ చీఫ్ ఎన్.నరసింహమూర్తికి సేకరించిన శాంపిల్స్ స్వభావం గురించి వివరించి మరికొన్ని పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని, పరీక్షల అనంతరం వివరాలు వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. ఈ బృందం ఆదివారం ఢిల్లీ బయల్దేరి వెళ్లి కేంద్రం జలవనరులశాఖతో ప్రాజెక్టులో నమూనాల పరీక్షల విషయం నివేదిక ఇవ్వనుంది. ఈ కార్యక్రమంలో ఇఇలు డి.శ్రీనివాస్ బాలకృష్ణ, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌స్ట్రాక్చర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ఎ.గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మరళీ పమ్మి, మేనేజర్లు వెంకటేష్, గణపతిరావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



బాలోత్సవ సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపిమూర్తి

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యార్థుల్లో కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా జాతీయ సమైక్యతా భావాన్ని బాలోత్సవాలు పెంపొందిస్తాయని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి అన్నారు. శనివారం స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ విద్యాసంస్థల ఆవరణలో డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు ప్రాంగణంలో హేలాపురి బాలోత్సవం ఆవరణలో రెండో రోజు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. రెండో రోజు ప్రారంభ సభ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి ఎంఎల్‌సి గోపిమూర్తి మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులను యంత్రాలుగా మర మనుషులుగా మార్చే విద్యా విధానం కొనసాగుతుందన్నారు. విద్యార్థుల్లో సాంస్కృతిక జీవనం, సోదర భావం, సమానత్వం వంటి అంశాలను నేటి విద్యా వ్యవస్థ విస్మరించిందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను, కళానైపుణ్యాలను, శాస్త్ర సాంకేతిక ఆలోచనా విధానాన్ని పెంపొందించే విద్యావ్యవస్థ ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యామ్నాయ వేదికగా బాలోత్సవం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హేలాపురి బాలోత్సవం కార్యనిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ కొత్తగూడెంలో ప్రారంభమైన బాలోత్సవం రాష్ట్రవ్యాప్తంగా 45 కేంద్రాల్లో దిగ్విజయంగా సాగుతుందన్నారు. విద్యార్థులను పరిపూర్ణ పౌరులుగా తీర్చిదిద్దడంలో బాలోత్సవం కృషి ఎనలేనిదన్నారు. ఆరేళ్లుగా హేలాపురి బాలోత్సవాన్ని వేలాదిమంది విద్యార్థులతో నిర్వహించడం ద్వారా ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి రాము సూర్యారావు, సెట్‌వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకర్, బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, అకడమిక్ అంశాల సమన్వయకర్త ఎస్.కె.ముస్తఫాఅలీ, సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత కోనేరు సురేష్‌బాబు, ఎన్‌జిఒ అసోసియేషన్ పూర్వ జిల్లా అధ్యక్షులు ఎల్.విద్యాసాగర్, హెయిర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ కెకె.కుమార్‌గుప్తా, జిఎస్.ప్రసాద్, డాక్టర్ బి.సుబ్బారావు, కె.అబ్రహం, సూర్య గ్రూప్ ఆఫ్ కంపెనీ ఛైర్మన్ చామర్తి కృష్ణారావు, అపుస్మా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కడియాల విజయలక్ష్మి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్.రవికుమార్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాన్ని చాటిన బాలోత్సవం

రెండో రోజు బాలోత్సవంలో మట్టితో బొమ్మలు తయారు చేయడం, పేపర్ క్రాఫ్ట్, కథలు చెప్పడం, మైక్రో ఆర్ట్, క్విజ్, జానపద నృత్యాలు, ఏకపాత్రాభినయనాలు, లఘు నాటికలు, చిత్ర సమీక్ష, బెస్ట్ ఫ్రం వేస్ట్, మేజిక్ షో, మెమరీ టెస్ట్, పద్యం భావం వంటి అంశాల్లో విద్యార్థులు ఉత్సాహపూరితంగా పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. విచిత్ర వేషధారణలో సోది అమ్మాయి, మాంత్రికుడు, పిచ్చివాడు, రైతు, హరిదాసు, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. లఘు నాటికలో మా నాన్న కోసం అనే నాటిక ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. కోలాటం బృందాల ప్రదర్శన అద్భుతంగా ఆకట్టుకుంది. బృంద నృత్యాల్లో విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబర్చారు. లింగపాలెం విద్యార్థి సంజన కళ్లకు కర్చీఫ్ కట్టుకొని కీబోర్డు వాయించడం విస్మయపర్చింది. మొత్తం మీద బాలోత్సవం ఒక జాతరను తలపించిందని చెప్పవచ్చు. మూడో రోజు ఆదివారం బాలోత్సవం కొనసాగనుంది.

చిన్నారుల సెల్ఫీ సందడి

సమస్యల హోరు.. మారని తీరు..!

రెండు జిల్లాల్లో ప్రజా సమస్యలు హోరెత్తుతున్నాయి. చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పే పాలకులు, అధికారులు ఎన్ని చట్టాలున్నా మహిళలపై అఘాయిత్యాలకు అడ్డే లేదని ఏలూరు, జీలుగుమిల్లి ప్రాంతాల్లోని ఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. జిల్లాల పునర్విభజన, కొత్త పంచాయతీల ఏర్పాటు పేరిట ప్రభుత్వం తీసుకొచ్చిన అంశాలు ఆయా ప్రాంతాల్లో ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జనం వ్యక్తిగత, ప్రాంతీయ, సామాజిక సమస్యలతో సతమతమవుతున్నారు. ఇది ప్రతిపక్ష నేతలో, ప్రజాసంఘాల నేతలో చెప్పారనుకుంటే ఉద్దేశపూర్వకం అనుకోవచ్చు. కానీ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారమూ నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్‌కు వస్తున్న అర్జీలు ఒక ఉదాహరణ అయితే, తాజాగా ప్రజాదర్బార్, జనవాణి పేరిట అధికార టిడిపి, జనసేన ఎంఎల్ఎలు తమ నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో సమస్యలు పరిష్కరించాలని తరలొస్తున్న జనమే ప్రత్యక్ష నిదర్శనం. ప్రధానంగా ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్య, పింఛన్లు, రోడ్లు, భూ సమస్యలపై వినతులు ఎక్కువగా వస్తున్నాయి. భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఎన్ని అర్జీలిచ్చినా పరిష్కారం కాని భూ సమస్యలు కాసులిస్తే క్షణాల్లో పని పూర్తయిపోతుందని, తాము డబ్బులిచ్చుకోలేక అధికారులు, నేతల చుట్టూ తిరుగుతున్నామని పేద, మధ్య తరగతి ప్రజలు వాపోతున్నారు. ఇక రోడ్లు వంటి సమస్యలపై హామీలివ్వడం తప్ప కార్యాచరణలో ఒక్క అడుగూ ముందుకు పడని పరిస్థితి. ఇక ఇళ్లు , ఇళ్ల స్థలాలు, పింఛన్ల విషయంలో ప్రభుత్వం నుంచే కదలిక రావాల్సి ఉంది. వీటి విషయంలో ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకుంటే తప్ప ఈ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం లేదు. ప్రభుత్వం మాత్రం ఆరు నెలలకోసారి పింఛనుదారులు ఎవరైనా మృతి చెందితే వారి స్థానంలో కొత్త వారికి ఇవ్వడం తప్ప, అర్హులందరికీ పింఛన్ ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఆ సమస్యలన్నీ అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయి. దీంతో అధికారులకు మాత్రం తిప్పలు తప్పడం లేదని స్పష్టమవుతోంది.

ఇక జిల్లా కేంద్రమైన ఏలూరు నడిబొడ్డున పాత నేరస్తుడు ఒక యువతిని ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడంటే శాంతిభద్రతల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇది రాత్రివేళల్లో పోలీసింగ్ పెరగాల్సిన ఆవశ్యకతను సూచిస్తోంది. ఇక జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెంలో గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఏడో నెల గర్భిణి అయ్యే వరకూ ప్రిన్సిపల్, వార్డెన్ గుర్తించకపోవడం విద్యార్థుల పట్ల అధికారులు, సిబ్బంది ఏపాటి శ్రద్ధ వహిస్తున్నారో స్పష్టమవుతోంది. ప్రతి హాస్టల్‌లో నెల నుంచి మూడు నెలల్లోపే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహింపజేస్తున్నామని అధికారులు చెప్పే మాటలన్నీ అవాస్తవాలని మరోసారి స్పష్టమైంది. కారణమేదైనా ప్రిన్సిపల్, డిప్యూటీ వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. అదే రీతిలో జంగారెడ్డిగూడెంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్యకు సంబంధించి ఎటువంటి చర్యలూ లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. పైగా ఈ ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని కోరిన విద్యార్థిని బంధువులు, ప్రజాసంఘాల నేతలపై కేసులు పెట్టడం, బెదిరింపులకు దిగడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ఈ ఘటనలు పునరావృతం కాకుండా కలెక్టర్, ఎస్‌పి రంగంలోకి దిగి ఆయా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు ధైర్యం చెప్పడంతోపాటు డివిజన్, మండలస్థాయి అధికారులు తరచూ వసతి గృహాల్లో తనిఖీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటే పరిస్థితులు మెరుగుపడే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక కొత్తగా ఏర్పాటు చేయనున్న పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలనే డిమాండ్ బలంగా విన్పిస్తోంది. సిపిఎం, ప్రజాసంఘాల జెఎసి నేతలు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. వేలేరుపాడులో ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు జిల్లా సాధన కమిటీ నేతలు వినతిపత్రం అందించారు. ఆయన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలిపేలా చూస్తానని హామీ ఇచ్చారు. సిఎం, డిప్యూటీ సిఎం హోదాలో ఉన్న ఇరువురు ఎన్నికల ముందు కూటమి నేతలుగా పోలవరం జిల్లా ఏర్పాటుకు హామీ ఇచ్చిన వారే. అదీ ప్రధానంగా నిర్వాసితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉంటుందని సైతం చెప్పారు. దానికి భిన్నంగా ముసాయిదా నోటిఫికేషన్ వెలువడింది. దీనిపై సిఎం, డిప్యూటీ సిఎం స్పందిస్తే పోలవరం నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నెరవేరే అవకాశం ఉంది. దానికోసం నెలాఖరు వరకూ నిరీక్షించక తప్పదు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం నేతలు ఉవ్విళ్లూరుతుండగా పంచాయతీల విభజన అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెరపైకి వచ్చింది. ఇప్పటికే గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలనే డిమాండ్ ఉంది. ఇవీగాక పలు చోట్ల పంచాయతీలను విభజించాలనే డిమాండ్ ఉంది. ఈ రూపంలో కొన్నిచోట్ల గతంలో స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించిన పరిస్థితీ ఉంది. ఈ సారైనా ఈ సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపుతుందో.. లేక నాన్చుతుందో వేచిచూడాలి.

- వివిఎస్‌వి.ప్రసాద్

పరింపూడి విఆర్ఒ బట్టు సస్పెండ్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పరింపూడి గ్రామానికి చెందిన విఆర్ఒ బట్టును విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఎఫ్ఎంసి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. సర్టిఫికెట్ జారీ విషయంలో నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలు రావడంతో ప్రాథమిక విచారణ అనంతరం విఆర్ఒపై చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతుందని, విచారణ ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నవోదయ ప్రవేశ పరీక్షకు జిల్లాలో 11 కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 2,311 మంది విద్యార్థులకు గాను 1,184 మంది విద్యార్థులు హాజరు కాగా 1,127 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి-2 పరీక్షా కేంద్రాలను, పెదవేగి నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ 1 పరీక్షా కేంద్రాన్ని, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షలు, ఏలూరు వారు 04 పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షలను పర్యవేక్షించారు. ఈ పరీక్షలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

భీమడోలు : భీమడోలు హైస్కూల్ కేంద్రంగా శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలకు హాజరయ్యేందుకు 1,778 మందికి హాల్ టికెట్లు మంజురయ్యాయి. భీమడోలు హై స్కూల్ కేంద్రానికి కేటాయించిన భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాలకు చెందిన 293 మందికి హాల్ టికెట్లు విడుదలయ్యాయి. పరీక్షల నిర్వహణకు 13 గదులు, ఒక్కొక్క గదికి 24 మంది వంతున పరీక్షలు రాసేందుకు కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్న భీమడోలు హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.శేషపద్మజ ఏర్పాట్లను చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు 144వ సెక్షన్‌ను భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి విధించారు. భీమడోలు ఎస్ఐ మదీనా భాషా తమ సిబ్బందితో వాటిని అమలు చేశారు. ఇదేవిధంగా గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్య సిబ్బంది మురళీ వైద్య సహాయ శిబిరాన్ని నిర్వహించారు. పరీక్షా కేంద్రాలను భీమడోలు తహశీల్దార్ పరిశీలించారు. భీమడోలు హై స్కూల్ పరీక్షా కేంద్రానికి ఫ్లయింగ్ స్క్వాడ్ బాధ్యులుగా జిల్లా విద్యాధికారి వెంకట లక్ష్మమ్మ వ్యవహరించారు. పరీక్షా కేంద్రానికి సిఎల్ఒగా పెదవేగి నవోదయ పాఠశాలకు చెందిన టి.సుధారాణి పనిచేశారు. పరీక్షలకు 111 మంది విద్యార్థులు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్స్ తెలిపారు. కార్యక్రమంలో భీమడోలు రెవెన్యూ ఆర్ఐ జగన్నాథంతోపాటు, విఆర్ఒ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

మండవల్లి : ఉన్నత విద్యలో రాణించి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు నవోదయ ప్రవేశ పరీక్ష ఎంతగానో దోహదపడుతుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన అధ్యక్షత నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. ప్రవేశ పరీక్షల్లో సుమారు 154 మంది పాల్గొని రాయలవలసి ఉండగా కేవలం 56 మంది మాత్రమే పాల్గొన్నారని తెలిపారు. 98 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు హెచ్‌ఎం తెలిపారు.

పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రమాదకరంగా ఉన్న బావి

పాఠశాలలో ప్రమాదకరంగా బావి

పూడ్చాలని తల్లిదండ్రుల వేడుకోలు

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పురాతన పాడుబడిన బావి పాఠశాల క్రీడా ప్రాంగణం మధ్యలో ప్రమాదకరంగా ఉండటంతో విద్యార్థులు కొంతమేర భయాందోళనలో ఉంటున్నారు. ఈ బావి 1948 విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు గాను అప్పట్లో ఆ భావిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ బావి పాడైపోయి ప్రమాదకరంగా మారింది. బావి సమీపంలోనే విద్యార్థులు ఆటలాడుకుంటూ ఉంటారు. కనీసం ఆ బావి పూడ్చి వేయడం గాని, లేదా బావి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయకుండా అలాగే వదిలేశారు. ఆట్లాడే సమయంలో తమ పిల్లలు బావిలో పడతారేమోనని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయురాలు శైలజను వివరణ కోరగా ఉన్నతాధికారులు, నాయకుల సమక్షంలో బావిని పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాజీయే రాజమార్గం

లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు కోర్టు వేదికగా జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 150 కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారమయ్యాయి. దీనిలో 120 క్రిమినల్, 15 మనోవర్తి, చెక్ బౌన్స్ కేసులు, 15 సివిల్ కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో ముఖ్యంగా 2008వ సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసు, 2012 నుంచి వివాదం నడుస్తున్న భార్యాభర్తల విడివిడిగా ఉన్న కేసు, 2015 సంవత్సరం నాటి కొట్లాట కేసు పరిష్కారమయ్యాయి. రాజీమార్గం ద్వారా పరిష్కారం చేసుకున్న కక్షిదారులను భీమడోలు న్యాయమూర్తి అభినందించారని బార్ అసోసియేషన్ తెలిపింది.

నూజివీడు టౌన్ : రాజీ మార్గమే కక్షిదారులకు రాజమార్గమని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ అన్నారు. పట్టణంలోని కోర్టు భవన సముదాయాల్లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్జి నాగ శైలజ మాట్లాడుతూ రాజీమార్గం ఒక్కటే రాజమార్గంగా గుర్తించాలన్నారు. రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. రాజీ పడదగిన అన్ని సివిల్ క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు లోక్ ఆదాలత్ ద్వారా పరిష్కరించుకునే చక్కని అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఇందుకోసం ఐదు ప్రత్యేక బెంచీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 2,340 కేసులు రాజీకి వచ్చి పరిష్కారమయ్యాయి. వీటిలో సివిల్ 63, క్రిమినల్ 2,277 కేసులు రాజీకి వచ్చాయని, వీటి ద్వారా 2,78,53,817 చెల్లించినట్లు తెలిపారు. 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె.పెద్ద కాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఒ.అనూష, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రావణిలు రాజీకి వచ్చిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించారు.

ముగిసిన ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు డివిజన్ స్థాయి టీచర్ల క్రికెట్ ఆటల పోటీలు ఈనెల 11 నుంచి 13 వరకు ఏలూరు, గోపనపాలెంలో నిర్వహించారు. ఈ పోటీలకు ఏలూరు డివిజన్ నుంచి పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు, మండవల్లి, కలిదిండి, ఉంగుటూరు, నిడమర్రు, భీమడోలు, ముదినేపల్లి, కైకలూరు మండలాలకు చెందిన టీచర్ల క్రికెట్ టీమ్‌లు పోటీపడ్డాయి. గోపన్నపాలెంలో జరిగిన క్రికెట్ ఫైనల్స్ మ్యాచ్‌లో ఏలూరు మండల టీచర్స్ క్రికెట్ టీం పెదవేగి మండలం టీచర్స్ టీమ్‌పై ఏడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో పెదవేగి మండలం నిలిచింది. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు గోపన్నపాలెం వ్యాయామ విద్య కళాశాలలో శనివారం బహుమతి ప్రదానం జరిగింది. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో జరగబోవు ఎంపిక పోటీల్లో పాల్గొంటారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలోని జెడ్‌పిహెచ్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. మహిళా ఉపాధ్యాయుల త్రోబాల్ పోటీల ఫైనల్‌లో టి.నర్సాపురం జట్టు జంగారెడ్డిగూడెం జట్టుతో తలపడింది. ఈ పోటీలను జీలుగుమిల్లి ఎంఇఒ బుద్ధుల రాముడు, టి.నర్సాపురం ఎంఇఒ బుచ్చిరాజు, బుట్టాయగూడెం ఎంఇఒ కళ్యాణి, బుట్టాయగూడెం ఎంఇఒ రాయ్ తదితరులు ఇరుజట్లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రారంభించారు. అనంతరం జరిగిన పోటీలో జంగారెడ్డిగూడెం జట్టు బెస్ట్ ఆఫ్ త్రీలో రెండు మ్యాచ్లు గెలిచి డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సోమ సుందర్ విజేత జట్లకు మెమెంటోలు అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన టి.నర్సాపురం జట్టును కూడా మెమెంటోతో సత్కరించారు. క్రికెట్ పోటీల్లో బుట్టాయగూడెం జట్టు డివిజన్ విన్నర్స్‌గా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. జంగారెడ్డిగూడెం క్రికెట్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఈ సందర్భంగా పలువురు విజేతలకు అభినందనలు తెలిపారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి

పలుచోట్ల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి దారబోయిన లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖల్లో సాధించిన ప్రగతిని తెలియజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ అధికారులు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.మణికుమారి, డిప్యూటీ ఎంపిడిఒలు జెవి .రమణమ్మ, ఎల్.నాగలక్ష్మి, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం ఎంపిపి ఆరేపల్లి శిరీష అధ్యక్షతన నిర్వహించి పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పయనించేలా విజన్ రిపోర్ట్ తయారుచేసి ముందడుగు వేస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని కనీస సౌకర్యాలను కల్పించి, అభివృద్ధి పథకాలు, అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందించడం ద్వారా శరవేగంగా అభివృద్ధి సాధించే దిశగా ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వాలు కల్పించే అనేక అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా వైస్ ఛైర్మన్ గుడిమెళ్ల కృష్ణంరాజు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం బహిష్కరణ

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండల అధ్యక్షులుపై నవంబర్ 26న ఆర్‌డిఒ సమక్షంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా 11 మంది ఎంపిటిసిలు ఓటు వేశారని, అవిశ్వాస తీర్మానంపై మినిట్స్ నమోదు చేసి కలెక్టర్, సిఇఒ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరుగుతుందని ఎంపిడిఒ జ్యోతి గతంలో తెలియజేశారు. ఈ అవిశ్వాస తీర్మానం జరిగి 15 రోజులవుతున్నా ఇప్పటి వరకు ఎంపిపి ఎన్నిక నిర్వహించకపోవడంతో శనివారం నిర్వహించినటువంటి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంను ఎంపిటిసి సభ్యులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి గగ్గులోతు మోహన్ రావు మాట్లాడుతూ బుట్టాయగూడెం ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం పెట్టి 15 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు ఇన్‌ఛార్జిని ఇవ్వడం గాని, ఎన్నిక నిర్వహించడం గాని లేదని, త్వరగా ఎన్నిక నిర్వహించాలని కోరుతున్నామన్నారు. అప్పటి వరకు సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి వీలులేదని ఎంపిటిసి సభ్యులందరూ తెలియజేశారు. ఎంపిపి ఎన్నిక జాప్యం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఈ అవిశ్వాస తీర్మానంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, ప్రభుత్వాదేశాల మేరకే తదుపరి చర్యలు ఉంటాయని ఎంపిడిఒ కె.జ్యోతి తెలియజేశారు. మండల పరిషత్లో రాజకీయ వేడి మొదలైంది. వైస్ ఎంపిపి-1 కుక్కల వరలక్ష్మిపై మెజారిటీ ఎంపిటిసి సభ్యులు శనివారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. వైస్ ఎంపిపి-2 గుగ్గులోతు మోహనరావు నేతృత్వంలో వారు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఎంపిడిఒ కె.జ్యోతికి అందజేశారు. సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

శిథిలావస్థలో పంచాయతీ కార్యాలయం

- పెచ్చులూడి పడుతున్న స్లాబ్
- భయాందోళనలో ఉద్యోగులు, ప్రజలు
- అందుబాటులోకి రాని సచివాలయం

పెచ్చులూడుతున్న స్లాబు

ప్రజాశక్తి - మండవల్లి

పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పిల్లర్ల నుండి పెచ్చులూడి పడుతుంది. ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందోనని ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. సచివాలయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో శిథిలావస్థకు చేరిన పంచాయతీ కార్యాలయంలో తప్పనిసరిగా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజలకు సేవలు అందించే క్రమంలో స్లాబు నుండి పెచ్చులు ఊడి తలపై పడి ఎప్పుడు తలలు పగులుతాయోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం మండలంలోని అయ్యవారి రుద్రవరం గ్రామంలోని ప్రజలకు పంచాయతీపరమైన సేవలందించే విధంగా 1997-98 కాలంలో పంచాయతీ కార్యాలయానికి శంకుస్థాపన చేసి, 1999లో పూర్తిచేసి అప్పటి సర్పంచి కుంచే మహా లక్ష్మయ్య రెడ్డి ప్రారంభించి పంచాయతీ కార్యాలయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గ్రామంలోనే పరిష్కరించే విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి 11 శాఖలకు చెందిన ఉద్యోగులను నియమించడంతో పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూ.43.60 లక్షల నిధులతో సచివాలయం నిర్మించి 2024లో ప్రారంభించారు. సచివాలయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో నేటికీ పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే పంచాయతీ కార్యాలయం నిర్మించి సుమారు 27 సంవత్సరాలు కావడంతో కార్యాలయం శిథిలావస్థకు చేరింది. కార్యాలయం స్లాబు, పిల్లర్ నుండి పెద్ద పెద్ద

అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయం

పెచ్చులు ఊడిపడిపోతున్నాయి. ఈక్రమంలో ఉద్యోగులు పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహించడానికి భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు కూడా పంచాయతీ కార్యాలయానికి వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న పంచాయతీ కార్యాలయం స్లాబ్ నుండి పెచ్చులు ఊడిపడి ప్రమాదం సంభవించక ముందే ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న సచివాలయాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ఉద్యోగులను, ప్రజలను ప్రమాదబారి నుండి కాపాడాలని కోరుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి పంచాయతీరాజ్ ఎఇ మహమ్మద్ సయ్యద్ భాషాని వివరణ కోరగా సచివాలయానికి టైల్స్, కిటికీల పనులు చేయాల్సి ఉందన్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఉత్తమ సేవకులు డాక్టర్ ఇవాంజిలిన్

అంబేద్కర్ సేవా ట్రస్ట్ ఛైర్మన్ ప్రత్తిపాటి వర కిశోర్

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఇవాంజిలిన్ ఉత్తమ సేవలు అందిస్తున్నారని అంబేద్కర్ సేవా ట్రస్ట్ ఛైర్మన్ ప్రత్తిపాటి వర కిశోర్ అన్నారు. శనివారం వైద్యశాల ఆవరణలో అంబేద్కర్ సేవ ట్రస్ట్ ఛైర్మన్ ప్రత్తిపాటి వర కిశోర్ మాట్లాడుతూ డాక్టర్ ఇవాంజిలిన్ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందిస్తున్నారన్నారు. వైద్యశాల పరిధి గ్రామాల ప్రజలు అనారోగ్య పరిస్థితుల్లో ప్రయివేటు వైద్యశాలకు వెళ్లినప్పటికీ, వారి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకోవడం, తమ సిబ్బందిని పంపించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అన్ని తరగతుల ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజలకు అందుబాటులో ఉన్న ఆయన వినతులు స్వీకరించి, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలనే సదాశయంతో ముందుకెళ్తున్నామన్నారు. ఈ విషయంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా తాము చేయాలనుకున్న మేలును చేసే తీరుతామని స్పష్టం చేశారు. అలాగే ప్రజాసమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఉప ముఖ్యమంత్రిని కోరిన ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం నియోజకవర్గం పరిధిలో ఉన్న పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరినట్లు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. శనివారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పవన్ కళ్యాణ్‌ను మర్యాద పూర్వకంగా కలిసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పంచాయతీల అభివృద్ధి నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా పలు విషయాలను చర్చించినట్లు తెలిపారు.

'కాఫీ విత్ సిఎం'లో వాసు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సిఎం చంద్రబాబుతో వాసు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టిడిపి మండల అధ్యక్షులు యనమదల శ్రీనివాసరావు(వాసు) శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాఫీ విత్ సిఎం అనే కార్యక్రమంలో అన్ని మండలాల పార్టీ అధ్యక్షులకు సిఎం చంద్రబాబు శుక్రవారం ప్రత్యేక శిక్షణ అందించినట్లు వాసు తెలిపారు. మండల స్థితిగతులు, పార్టీ అభివృద్ధిపై చర్చించినట్లు చెప్పారు. గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రత్యేక పంచాయతీగా చినవెల్లమిల్లి!

గ్రామస్తుల డిమాండ్ : సాధన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - ఉంగుటూరు

వెల్లమిల్లి పంచాయతీ పరిధిలో చిన్నవెల్లమిల్లి, చింతాయగూడెం, లంబాడీగూడెంలను కలిపి చినవెల్లమిల్లి ప్రత్యేక పంచాయతీగా ఎంపిక చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు శుక్రవారం రాత్రి చినవెల్లమిల్లిలో గ్రామస్తులంతా సమావేశం అయ్యారు. ప్రత్యేక పంచాయతీ సాధన కోసం కమిటీలను నియమించుకున్నారు. దీనిపై అధికారులకు ప్రజావాణిలో అర్జీ అందించారు. కమిటీ సభ్యులంతా ఎంఎల్ఎని కలిసి వినతి పత్రం ఇవ్వనున్నారు.

ఇంటికి పెయింట్ వేస్తూ..

నేరాలు : ఘోరాలు

ప్రజాశక్తి - ముసునూరు

ఇంటికి పెయింట్ వేస్తూ విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం మండలం పరిధిలోని బలివే గ్రామానికి చెందిన మాగంటి రమాదేవి ఇంటికి రంగులు వేస్తున్న పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన దులాల్ కర్మాకర్(40), అదే రాష్ట్రానికి చెందిన మిశ్రా కర్మాకర్ వీరిరువురికి ప్రమాదవశాత్తు 11 కెవి విద్యుత్తు తీగలు తగిలాయి. ఇరువురిని జిల్లా కేంద్రమైన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ దులాల్ కర్మాకర్ మరణించారు. అతని భార్య లక్ష్మీబాయి కర్మాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్న వయస్సులోనే అసాధారణ ప్రతిభ

ప్రత్యూషకు ఏపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ సన్మానం

ప్రజాశక్తి - పోలవరం

కామవరపుకోటలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి జిల్లా స్థాయిలో ప్రతిభను చాటుకున్న మండలంలోని గుటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని వి.ప్రత్యూషను ఏపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి సన్మానించారు. శనివారం చేగొండపల్లి గ్రామంలోని శాప్ కార్యాలయం వద్ద ప్రత్యూషకు రన్నింగ్ షూస్, పుస్తకాలను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జగదీశ్వరి మాట్లాడుతూ చిన్న వయసులోనే అసాధారణ పట్టుదల, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగుతున్న ప్రత్యూష భవిష్యత్తులో రాష్ట్రం, దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇలాంటి ప్రతిభ వెలుగులోకి రావడం ఆనందకరమని అన్నారు. ప్రత్యూష సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని, క్రమశిక్షణతో సాధన చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. అనంతరం రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్,

విద్యార్థిని సన్మానిస్తున్న డైరెక్టర్ జగదీశ్వరి

టిడిపి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జీవుల నాయక్‌ను పార్టీ కార్యాలయం వద్ద శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.చంద్రశేఖర్, శారీరక విద్య గురువు మధుకిషోర్, బొరుసు బాలాజీ, కె.దుర్గాప్రసాద్, పి.నరేష్ చౌదరి, కృష్ణ పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

గ్రామాలాభివృద్ధిలో దాతల సహకారం ఎంతో అభినందనీయమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి-4 స్ఫూర్తితో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో మరెంతో మంది దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం కోటేశ్వర దుర్గాపురం గ్రామంలో నెక్స్ట్‌జెన్ సంస్థ అధినేత అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం సహకారంతో గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో సుమారు రూ.11 లక్షలు వెచ్చించి నిర్మించిన నూతన వాటర్ ప్లాంట్‌ను శనివారం ఉదయం ఎంఎల్ఎ ప్రారంభించారు. దాత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తమ సొంత గ్రామం జాలిపూడితో పాటు ఏలూరు రూరల్ మండలం పరిధిలోని సమీప గ్రామాల అభివృద్ధికి సైతం తమ సంస్థ తరపున అండగా ఉంటామని, ప్రజల తాగునీటి సమస్యలు తీర్చడానికి వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎంఎల్ఎ చింతమనేని మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సమర్థవంతమైన ప్రభుత్వంతోపాటు దాతల సహకారం కూడా ఎంతో అవసరమని, రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబాలకు అండగా ఉండాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి పి-4 కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. అభివృద్ధి సంక్షేమాల్లో దాతలు స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు రూరల్ మండల అధ్యక్షులు నంబూరి నాగరాజు, సీనియర్ నాయకులు సైదు సత్యనారాయణ, నేతల రవి, పైడిపాటి శేఖర్, పాపారావు, మరడాని రమేష్ సహా పలువురు కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నేతలు

మండలంలోని అల్లూరు గ్రామంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిన సంఘటనలో తోట నాగరాజు రేకుల షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదంలో నాగరాజు కుటుంబ సభ్యులు సర్వం కోల్పోయి కట్టు వస్త్రాలతో బయటపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ముదినేపల్లి టిడిపి మండల అధ్యక్షులు చల్లగొళ్ల శోభనాద్రి చౌదరి అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ నగదును పార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దావు నాగరాజు, బొంగు రవికుమార్, నీలిపల్లి సన్యాసిరావు, దాసరి శ్రీను, సింగరాతి సత్యనారాయణ, గంగుల శ్రీరాములు, పత్తి శివశంకర్, భాను శ్రీను, శివ, టిడిపి నేతలు పాల్గొన్నారు.

అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ మానవత దృక్పథంతో నిరాశ్రయులైన తోట నాగరాజు దంపతులకు తన వంతుగా రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకున్న దాంట్లో తనకు తోచిన సహాయం అందించానని, ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ చేతనైన సాయం చేయాలని తెలిపారు.

ఉన్నతాధికారులతో ఐటిడిఎ ప్రిన్సిపల్ సెక్రటరీ సమీక్ష

బుట్టాయగూడెం: ఐటిడిఎ కేఆర్ పురంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.ఎం.నాయక్ ఐటిడిఎలోని ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల ఉన్నతాధికారులతో ఆయా శాఖలపై ముఖ్యంగా విద్య, వైద్యం, మహిళల అభివృద్ధి కార్యక్రమాలు, విడివికెఎస్, సిఎస్ఎస్‌పై సమీక్ష నిర్వహించారు. కొన్ని శాఖలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం బూసరాజు పల్లి గిరిజన గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతులు, హాస్టల్, వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ కేఆర్ పురం పిఒ రాములు నాయక్, పోలవరం ఎస్‌టిసి కిషోర్, ఇంజినీరింగ్ డిఇ శ్రీనివాస్, డివైఇఒ రవి ప్రసన్నకుమార్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ సురేష్ పాల్గొన్నారు.

'రాష్ట్రంలోని సంపదను పేదలకు పంచాలి'

ఏలూరు అర్బన్: భూ పోరాటం ఎర్రజెండా సొత్తు అని, రాష్ట్రంలో సంపదను పేదలకు పంపిణీ చేయాలని వక్తలు పేర్కొన్నారు. సిపిఐ శత వార్షికోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెయంయు) ఆధ్వర్యాన శనివారం సిపిఐ జిల్లా స్ఫూర్తి భవనంలో రాష్ట్ర భూ సదస్సు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొన్న దారి దీపం పత్రిక చీఫ్ ఎడిటర్ డివివిఎస్.వర్మ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం పోరాటంతోనే వన సంరక్షణ సమితులు ఏర్పడ్డాయని, కొంతమేరైనా పేదలకు భూ పంపిణీ జరిగిందని పేర్కొన్నారు. భూ సంస్కరణల చట్టం వచ్చిన గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ పేదరికం తొలగిపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత మతపరంగా ప్రజల మధ్య విద్వేషాలు తగ్గించి పాలన చేస్తున్నారని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జల్లి విల్సన్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య ఉన్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణ

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని వేర్వేరు గ్రామాల్లో ఇళ్లకు తాళాలు వేసి మూడు కుటుంబాలకు చెందిన సభ్యులు గ్రామాంతరం వెళ్లిన సందర్భంగా జరిగిన చోరీలు కలకలం రేకెత్తించాయి. మూడు దొంగతనాలు ఒకే తరహాలో డోర్ లాక్‌లను తొలగించి జరిగాయి. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు పొలసానిపల్లిలోని కాలనీలో వేరువేరు ఇళ్లల్లో పక్క పక్కనే నివాసం ఉంటున్న గంజి సుబ్బారావు, వి.యేసయ్య ఇళ్లల్లో చోరీలు జరిగాయి. ఈ సందర్భంగా 9 కాసుల బంగారం, రూ.50 వేల నగదు, కొంత వెండి సామగ్రి చోరీ జరిగినట్లు ఫిర్యాదు అందింది. దీని విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని బాధితులు పేర్కొన్నారని తెలిపారు. ఇదే తరహాలో భీమడోలులోని గొలుసుల గేటు సమీపంలో నివాసముంటున్న పెనుగొండ శ్రీనివాసరావు ఇంట్లో అదే తరహాలో జరిగిన చోరీలో రూ.15 వేల నగదు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలను సేకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. కేసు నమోదు చేసిన భీమడోలు ఎస్ఐ మదీనా భాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వికలాంగులకు బాధ్యతగా సేవ చేయాలి

తపన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి

ప్రజాశక్తి - భీమడోలు

వికలాంగులకు సకలాంగులు చేసేది సేవ కాదని, దానిని బాధ్యతగా గుర్తించాలని తపన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి(తపన చౌదరి) అన్నారు. భీమడోలులో శనివారం జిల్లాస్థాయి వికలాంగుల సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా తపన చౌదరి పాల్గొని మాట్లాడుతూ దేశ స్థాయిలో సక్షమ్ సంస్థ వికలాంగుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. దీనిలో భాగంగా ఉన్న తాను సైతం జిల్లాస్థాయిలో తపన ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వికలాంగులకు క్రీడా సాంస్కృతిక విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వికలాంగులకు బహుమతులను అందజేశారు. పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన వికలాంగులను సత్కరించారు. కొందరు వికలాంగులకు వీల్ చైర్లను అందజేశారు. ఉపాధి కల్పనలో భాగంగా లామినేషన్ మిషన్ సమకూర్చారు. కార్యక్రమంలో ప్రముఖులు పాలేటి వీర వెంకట సత్యనారాయణ, మాధురి కళాశాల కరస్పాండెంట్ ప్రేమ్ కుమార్, బెంజిమెన్, జ్యోతి పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

E.P.No.209/2025 in O.S.No.882/2024

Between:-

సాగి వెంకట సత్యనారాయణ వర్మ ...DHR/వాది

మరియు

గుండుగొంటి శ్యామలరావు ...JDR/ప్రతివాది

To.

గుండుగొంటి శ్యామలరావు తండ్రి రామస్వామి, ఇంటినెం.11/115/2, హరి జనపేట, చింతలపూడి, ఏలూరు జిల్లా.

పై నెంబరు అమలు గ్రంధములో JDR అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.05-01-2026సం॥రం తేదికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10.30ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనియెడల పై అమలు గ్రంధము మీ పరోక్షమున తీర్మానించ బడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
చిత్తలూరి వెంకట సుబ్బారావు
న్యాయవాది, కాకినాడ
సెల్.9948519236

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, నడిపూడి గ్రామం, చింతలపాలెంనకు చెందిన జుత్తిగ నాగరాజు తండ్రి ఏడుకొండలు అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. నడిపూడి నుండి తణుకు వెళుతుండగా మార్గమధ్యంలో సిద్ధాంతంలో పడిపోయింది. నా యొక్క పాస్పోర్ట్ నెంబర్ : U1851692 గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

జుత్తిగ నాగరాజు, తండ్రి : ఏడుకొండలు
చింతలపాలెం, నడిపూడి,
పెనుగొండ మండలం
ప.గో.జిల్లా. సెల్ : 8688531452

పాస్‌పోర్టు పోయినది

సోడదాసి అరుణ, భర్త: డేవిడ్ రాజు, డోర్ నెంబర్ 10-149, మోడీ ఎల్ ఎన్ పురం, బొండాడ, కాళ్ళ మండలం, ప.గో.జిల్లా,ఎ.పి. ప్రజలకు తెలియ జేయునది ఏమనగా.. నేను ది 09-04-2014లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి నెంబర్ L8453230, పాస్ పోర్ట్ పొందియున్నాను. ది.25-11-2025న భీమవరం నుంచి పాలకొల్లు మండలం లంకల కోడేరు బస్‌లో వచ్చి అక్కడ నుంచి వెంకటాపురం బైక్ మీద జెరాక్స్ సెంటర్‌కు రాగా (నా పాస్ పోర్ట్ జెరాక్స్ తీయించుటకు, పాస్ పోర్ట్ రెన్యువల్ గురించి మాట్లాడటానికి రాగా) నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడిపోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు.ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ అందజేయగలరు.
నా సెల్ నెంబర్ **9515421283**

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

Creditor I.P.No.27/2025

Between:

కొత్తపల్లి నాగరాజు, S/o.సూర్యారావు, డోర్‌నెం.9-51, రామాలయం వీధి, మొగల్తూరు, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా. ...పిటీషనర్/క్రెడిటర్

1.జంపా శ్రీనివాస్, S/o.(లేటు) వెంకటస్వామి, కోట వద్ద, మొగల్తూరు, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా.
2.జంపా పద్మ కుమారి, W/o.(లేటు) వెంకట స్వామి, కోట వద్ద, మొగల్తూరు, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా.
3.జంపా నాగ శివాంజనేయులు, S/o.(లేటు) వెంకటస్వామి, కోట వద్ద, మొగల్తూరు, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా.
4.జంపా రవళి, W/o.జంపా నాగ శివాంజనేయులు, కోట వద్ద, మొగల్తూరు, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా.
5.అఫీషియల్ రిసీవర్, జిల్లా కోర్టు, ఏలూరు. ...రెస్పాండెంట్స్

పై నెంబరు పిటీషన్‌లో పిటీషనర్, 1వ రెస్పాండెంట్‌ను ఇన్ సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని అతను 3 నుండి 4 రెస్పాండెంట్ పేరున వ్రాసిన క్రయదస్తావేజులను డాక్యుమెంట్ నెం.3463/ 2025. 3464/2025, 3465/2025 S.R.O. మొగల్తూరు, రద్దు చేయమని కోరుచూ (ఇన్‌సాల్వెంట్ పిటిషన్) దాఖలు చేసియున్నందున సదరు విషయమును పుర ప్రముఖులకు తెలియ జేయడమైనది. 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లెయిర్ చేయుటకు ఎవరికైనా అభ్యంతరములు ఉన్నయెడల పిటిషన్ వాయిదా రోజున అనగా ది.05.01.2026వ తేదీన ఉదయం 10.30 ని.లకు మీరు స్వయముగా గాని, ప్లీడర్ ద్వారా గాని పైకోర్టు నందు హాజరు అయి మీ వాదనను దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షములో పిటీషన్ తీర్మానము చేయబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి అనుమతితో ఆర్డర్ తేది.5.12.2025

వైదాని మోహన్
నరసాపురం న్యాయవాది, ఏలూరు.
తేది.13-12-2025 సెల్: 9505159177